మెట్రో ఈవెనింగ్
RNI No.68319/98
BREAKING EDITION
Estd : 1998
2 PM
April 15,2026
Wednesday
Hyderabad
Vol:28, Issue:266

# డీ లిమిటేషన్‌పై రాజకీయ రచ్చ




## అగ్రనేతల సుదీర్ఘ చర్చ

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణలో రాజకీయ పరిణామాలు, పార్టీ నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. సీఎం నివాసంలో బుధవారం జరిగిన ఈ భేటీలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా హాజరయ్యారు. జగిత్యాలకు చెందిన సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేయడం, నామినేటెడ్ పదవులను భర్తీ చేయడం, చైర్మన్ పదవీకాలం ముగిసిన వారి విషయంలో రెన్యూవల్ చేయడం లేదా కొత్త వారిని నియమించే దానిపై ముగ్గురు నేతలు సుదీర్ఘంగా చర్చించారని తెలుస్తోంది. వాస్తవానికి బడ్జెట్ సమావేశాల్లోపు నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీచేస్తామని పీసీసీ చీఫ్ ప్రకటించారు. కానీ అది జరగకపోవంతో... చైర్మన్ పదవులు ఆశిస్తున్నవారిలో నైరాశ్యం నెలకొంది. మరోవైపు కొందరు చైర్మన్ల పదవీకాలం ముగిసినా.. పార్టీ ఏ నిర్ణయం తీసుకోలేదు. వారిని కొనసాగించడమా.. కొత్తవారికి అవకాశాలు ఇవ్వడమా అనేది తేల్చడం లేదు. ఇదిలా ఉంటే.. రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్తున్నారు. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. దక్షిణాది రా(ష్టాల వాదనకు జాతీయ స్థాయిలో బలం కూడగట్టే ప్రయత్నంలో మంగళవారం లేఖ కూడా రాశారు. అన్యాయం చేయవద్దని ప్రధానిని విజ్ఞప్తి చేస్తూనే... ఐక్యంగా పోరాడాలని దక్షిణాది రా(ష్టాలకు సీఎం పిలుపునిచ్చారు. గురువారం రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని సమాచారం.

## హర్మూజ్ దిగ్బంధనానికి
# 10 వేల మంది సిబ్బంది



ఇంటర్నెట్ డెస్క్: హర్మూజ్ జలసంధితో సహా ఇరాన్‌లోని కీలక ఓడరేవులపై పూర్తి దిగ్బంధనాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. హర్మూజ్ జలసంధిపై దిగ్బంధనానికి ఇరాన్ పోర్టుల్లో దాదాపు 10 వేల మంది సైనికులు, మెరైనర్లు, వైమానిక దళ సిబ్బందిని అమెరికా మోహరించింది. సముద్ర మార్గం ద్వారా జరిగే అంతర్జాతీయ వాణిజ్యం పైనే ఇరాన్ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఆధారపడి ఉంటుందని, కానీ దిగ్బంధనం ప్రారంభించిన 36 గంటల్లోనే ఇరాన్ నుంచి వెళ్లే వాణిజ్య నౌకలను అమెరికా దళాలు పూర్తిగా నిలిపివేశాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ తెలిపారు. అమెరికా నావికాదళ పర్యవేక్షణలో క్షిపణులు సిద్ధంగా ఉన్నాయని, అవి ఇరాన్ పోర్టుల నుంచి బయటకు వచ్చే నౌకలను, లోపలకు వెళ్లే వాటిని లక్ష్యంగా చేసుకుంటాయని ‘ఎక్స్’ వేదికగా అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఇదిలా ఉండగా, గల్ఫ్ దేశాల నుంచి బయల్దేరి హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లడానికి ప్రయత్నించిన రిచ్ స్టార్రీ అనే నౌక అమెరికా విధించిన దిగ్బంధనం కారణంగా వెనుదిరిగింది.



అండమాన్ సముద్రంలో పడవ మునిగి

# 250 మంది గల్లంతు

ఇంటర్నెట్ డెస్క్: రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ అండమాన్ సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో చిన్నారులు సహా దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదానికి సంబంధించి ఐక్యరాజ్య సమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. దక్షిణ బంగ్లాదేశ్‌లోని టెక్నాఫ్ నుండి బయలుదేరి మలేషియాకు వెళ్తున్న ట్రాలర్, బలమైన గాలులు, కెరటాల ఉధృతి, పరిమితికి మించిన జనంతో ప్రయాణించడం వంటి కారణాలతో మునిగిపోయినట్లు తెలుస్తోంది॥ అని ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్ (యూఎన్‌హెచ్‌సీఆర్) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పడవ ఏప్రిల్ 4వ తేదీన బంగ్లాదేశ్ నుంచి బయలుదేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేషియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఐక్యరాజ్య సమితి అధికారులు తెలిపారు. ఈ రోహింగ్యాలు వాస్తవానికి మయన్మార్‌కు చెందినవారు. కానీ 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు.

## కదిరిలో పేలిన గ్యాస్ సిలిండర్లు
# 4గురు మృతి

కదిరి, (మెట్రోన్యూస్) : సత్యసాయి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# ఫలితాల్లో బాలికల జోరు

మొదటి సంవత్సరం: 90 ఉత్తీర్ణత
రెండవ సంవత్సరం: 92 ఉత్తీర్ణత

ఏపి: ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల.. 12 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పాస్ పర్సంటేజ్ నమోదు

1. కృష్ణా జిల్లా (మొదటి స్థానం)

కృష్ణా జిల్లా విద్యార్థులు రికార్డు స్థాయి మార్కులతో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు.

2. గుంటూరు జిల్లా (రెండో స్థానం)

మెరుగైన విద్యా ప్రమాణాలతో గుంటూరు జిల్లా 88 ఉత్తీర్ణతతో రెండో స్థానంలో నిలిచింది. ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు.

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం..
## భార్యాభర్తలు సహా మూడేళ్ల చిన్నారి మృతి

ఢిల్లీ (మెట్రోన్యూస్): ఢిల్లీలోని రోహిణి సెక్టార్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. బుద్ధవిహార్ పరిధిలో స్లమ్ ఏరియాలో మంటలు చెలరేగడంతో గుడిసెలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. భార్యాభర్తలు సహా మూడేళ్ల చిన్నారి అగ్నికి ఆహుతి అవ్వడం స్థానికంగా అందర్నీ కలిచివేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్ధవిహార్ పరిధిలోని స్లమ్ ఏరియాలో సుమారు 400 చదరపు గజాల ప్లాస్టిక్ (స్క్రాప్‌ను నిల్వ ఉంచారు. దాని చుట్టే పలు గుడిసెలను నిర్మించుకున్నారు. అయితే బుధవారం తెల్లవారుజామున 1.25 గంటల ప్రాంతంలో (స్క్రాప్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన గుడిసెల్లోని కుటుంబాలు మంటలు అప్రమత్తమయ్యేలోపే మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

## అన్యాయం చేస్తే
# ఉద్యమిస్తాం
### పునర్విభజనపై కేంద్రానికి కేటీఆర్ హెచ్చరిక



హైదరాబాద్ (మెట్రో న్యూస్): నియోజకవర్గాల పునర్విభజన అంశంపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డిలిమిటేషన్ జరిగితే, అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని, మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన స్టాండ్‌కే కట్టుబడి ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రా(ష్టాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభానియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రా(ష్టాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

## బిహార్‌లో ముగిసిన నితీష్ యుగం..

పాట్నా, (మెట్రో న్యూస్): బిహార్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు రా(ష్టాన్ని పాలించిన నితీష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో, భారతీయ జనతా పార్టీ కి చెందిన బలమైన నేత సమ్రాట్ చౌదరి బిహార్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.




## అమెరికా-ఇరాన్ టెన్షన్ కూల్.. మార్కెట్లలో భారీ జోష్

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా, ఇరాన్ మధ్య భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడటంతో సూచీలు పరుగులు పెట్టాయి. ఉదయం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1303 పాయింట్లు (1.70 ) పెరిగి 78,150.54 వద్దకు చేరగా, నిఫ్టీ 392 పాయింట్లు (1.61 ) లాభపడి 24,237.70 వద్ద ట్రేడ్ అయింది. ఇరాన్‌తో వివాదం ముగింపు దశకు రావొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించడంతో ప్రపంచ మార్కెట్లలో స్థిరత్వం వస్తుందన్న ఆశలు పెరిగాయి. ఈ సానుకూల పరిణామం భారత మార్కెట్లకు మంచి ఊపునిచ్చింది.

## టాలీవుడ్‌లో సమ్మె సైరన్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల (థియేటర్ యజమానులు) మధ్య నెలకొన్న వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. ఆదాయంలో వాటా (రెవెన్యూ షేరింగ్) విషయంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో మే 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా సింగిల్ (స్క్రీన్ థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఎగ్జిబిటర్ల సంఘం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సమ్మర్ సీజన్‌లో విడుదల కావాల్సిన పలు క్రేజీ సినిమాల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ఉన్న రెంటల్ పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని థియేటర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిర్వహణ ఖర్చులు, ఓటీటీల ప్రభావంతో ప్రేక్షకుల సంఖ్య తగ్గడంతో థియేటర్లు నడపడం కష్టంగా మారిందని వారు చెబుతున్నారు.